సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



నిత్యాన్నదానానికి విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి పాలూరి వీర వేంకట నమశ్శివాయ దంపతులు (కాకినాడ) శనివారం రూ.లక్ష విరాళాన్ని ఈఓ సుబ్బారావుకు అందజేశారు.



పండ్ల పంటలపై విస్తృత పరిశోధనలు

కొవ్వూరులోని వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానాన్ని అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధన పథకం ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రకాష్ పాటిల్ శనివారం సందర్శించారు. - 8లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 11,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,300, మధ్య డెల్టాకు 2,150, పశ్చిమ డెల్టాకు 5,750 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రైతు బజార్ పునఃప్రారంభానికి చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న జేసీ నిషాంతి, చిత్రంలో అధికారులు

అమలాపురం టౌన్: అమలాపురంలోని రైతు బజార్‌ను పునఃప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. స్థానిక రైతు బజార్‌లో వివిధ మండలాలకు చెందిన రైతులతో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మూత పడిన రైతు బజార్‌ను తిరిగి తెరిచే అంశాలపై ఉద్యాన, మార్కెటింగ్, మత్స్యశాఖల అధికారుల సమక్షంలో రైతులతో చర్చించారు. జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో కె.మాధవి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీవీ రమణ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.విశాలక్షి సదస్సులో పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ అమలాపురం, రాయవరం రైతు బజార్ల సమస్యలను ఈ నెల 18న జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. దళారీలు లేకుండా కూరగాయలు, చికెన్, మటన్, చేపల దుకాణాలను నెలకొల్పాలన్నారు. ఇక్కడ కూరగాయలను విక్రయించుకునే రైతులకు అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

నేర పరిశోధనలో టెక్నాలజీ వాడాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: నేర పరిశోధనలో సాంకేతికతను ఎక్కువగా ఉపయోగించుకోవాలని ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. దీనిలో భాగంగా జిల్లాలోని అన్ని కూడళ్లలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. పోలీస్ శాఖకు ఉన్న సీసీటీవీలకు తోడు అదనంగా జిల్లాలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించాలన్నారు. నూతన సంవత్సర సంబరాలు, సంక్రాంతి పండగ సమయంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు ఉండాలన్నారు. చోరీల రికవరీలు, నిందితుల అరెస్ట్, కేసుల దర్యాప్తుల్లో వేగవంతం, నిందితులను త్వరిత గతిన అరెస్ట్ చేసిన సంఘటనలపై కూడా చర్చించి ఆయా సిబ్బందిని అభినందించారు. ఏఎస్పీ ఏవీ ఆర్‌పీబీ ప్రసాద్ మాట్లాడుతూ కొత్త సంవత్సరం, సంక్రాంతి పండగలకు పోలీస్ బందోబస్తుపై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట డీఎస్పీలు, జిల్లాలోని సీఐలు, ఎస్సైలతో పాటు ఎస్పీ కార్యాలయం స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమం.. సంక్షోభం

- ముగిసిపోతున్న 2024 సంవత్సరం
- తొలి మూడు నెలలూ పథకాల వెల్లువ
- తర్వాత ఎన్నికల నోటిఫికేషన్
- కూటమి పాలనలో నిలిచిన సంక్షేమం
- ఆరు నెలల్లో అమలు కాని సూపర్ సిక్స్

సాక్షి, అమలాపురం: సూర్యుడు పయనించే దిక్కును బట్టి భూమిపైన వాతావరణంలో మార్పులు వస్తాయి. ఆయన ఏడాదికి ఆరు నెలలు ఒక వైపు, మరో ఆరు నెలలు మరో వైపు ప్రయాణం చేస్తాడు. దాని ప్రకారం ఉత్తరం వైపునకు తిరిగితే ఉత్తరాయనం, దక్షిణం వైపునకు వెళితే దక్షిణాయనం అని సంభోదిస్తారు. 2024వ సంవత్సరం మరో రెండు రోజుల్లో ముగియనుంది. ఈ ఏడాది ప్రజలకు కొత్త అనుభవాన్ని మిగిల్చింది. ఉత్తరాయనం, దక్షిణాయనం మాదిరిగా రెండు రకాల పాలనలను ప్రజలు చూశారు. ఏడాది ప్రారంభంలో వైఎస్సార్ సీపీ సం'క్షేమ' పాలనను అనంతరం కూటమి ప్రభుత్వ సం'క్షోభ' పాలనను చవి చూశారు. తొలి భాగంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి, చెప్పిన తేదీకి సంక్షేమ పథకాలను అమలు చేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు పథకాలను కూడా అమలు చేయలేకపోయింది. నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచింది.



అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద వైఎస్సార్ చేయూత 4వ విడత నమూనా చెక్కు అందజేస్తున్న అప్పటి రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు (ఫైల్)



సంక్షేమ రాజ్యంలో...

జనవరి 24

వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా జిల్లాలో స్వయం సహాయక గ్రూపులు (ఎస్‌జీహెచ్) తీసుకున్న రుణాలను మాఫీ చేశారు. నాలుగో విడత జిల్లాలో 31,093 మంది లబ్ధిదారులకు రూ.254.24 కోట్లను వారి ఖాతాలలో జమ చేశారు.

జనవరి 30

సంక్షేమంలో మహిళలకు పెద్దపీట వేయాలనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంకల్పానికి అనుగుణంగా ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను వారి పేరు మీద రిజిస్ట్రేషన్లు చేశారు. దీని ద్వారా జిల్లాలో 67,052 మంది మహిళలకు లబ్ధి చేకూరింది. సుమారు 245 కాలనీల్లో రూ.728.95 కోట్లతో 1,811.44 ఎకరాలు కొనుగోలు చేశారు.

ఫిబ్రవరి 29

వైఎస్సార్ రైతు భరోసాలో భాగంగా మూడో విడత సొమ్ములకు సంబంధించి 1.65 లక్షల మంది రైతులకు రూ.33.33 కోట్లను వారి ఖాతాలలో నేరుగా జమ చేశారు. వీరిలో 6,248 మంది కౌలుదారులకు రూ.1.46 కోట్ల లబ్ధి చేకూరింది. అలాగే 35,707 మంది రైతులకు రూ.5.36 కోట్ల మేర వారి ఖాతాలో జమ చేశారు.

మార్చి 2

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం, మైనార్టీలు, కాపులు, క్రిస్టియన్ వర్గాలకు జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా లబ్ధి చేకూరింది. జిల్లాలోని 33,500 మంది విద్యార్థులకు రూ.25.80 కోట్లు అందించారు.

మార్చి 7

మిచాంగ్ తుపాను వల్ల వ్యవసాయ పంటలు నష్టపోయిన 19,849 మంది రైతులకు రూ.17.85 కోట్లు, ఉద్యాన శాఖ పంటలు నష్టపోయిన 3,530 మంది రైతులకు రూ.2.39 కోట్లు పెట్టుబడి రాయితీ అందించారు.

మార్చి 8

వైఎస్సార్ చేయూత పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు నాలుగో విడతగా జిల్లాలో 89,619 మందికి రూ.168.03 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు.

మార్చి 13

ఓఎన్జీసీ కార్యకలాపాల వల్ల నష్టపోయిన 69 గ్రామాల్లో 6,078 బోట్లపై చేపల వేట సాగిస్తున్న 22,811 మంది మత్స్యకారులు, 647 మంది ఒంటరి మహిళలకు నాలుగు విడతలుగా రూ.486 కోట్ల పరిహారాన్ని వారి ఖాతాలలో జమ చేశారు.

మార్చి 13

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లను గ్రేడ్ -2 ఫార్మసిస్టు ఉద్యోగులుగా ప్రభుత్వం పర్మినెంట్ చేసింది. దీని ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 267 మందికి ప్రయోజనం కలిగింది.

మార్చి 15

జిల్లాలో ఈబీసీ నేస్తం ద్వారా 11,496 మందికి రూ.17,24,40,000 లబ్ధి చేకూర్చారు.

నిరసనల హోరు



కలెక్టరేట్‌కు వస్తున్న ఆశా వర్కర్లను గేట్లు మూసివేసి అడ్డుకుంటున్న పోలీసులు (ఫైల్)

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పలు వర్గాల **నిరసనల ప్రదర్శనతో** జిల్లా కలెక్టరేట్, జిల్లా కేంద్రంతో **పాటు నియోజకవర్గ** కేంద్రాలు, మండల కేంద్రాలు హోరెత్తుతున్నాయి.

సెప్టెంబరు 30

తీర ప్రాంత మండలాల్లో ముంపు సమస్య పరిష్కరించాలని కోనసీమ రైతు పరిరక్షణ సమితి సభ్యులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పంట భూముల ఆక్రమణలు, మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించాలని డిమాండ్ చేశారు.

అక్టోబరు 2

సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, నాన్ పర్మినెంట్ ఉద్యోగులు తమను రెగ్యులర్ చేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష జేఏసీ పిలుపు మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళన చేపట్టారు.

అక్టోబరు 3

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేయకూడదని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో దీక్ష చేశారు.

నవంబరు 10

రాజోలు బీసీ బాలుర వసతి గృహం వద్ద ''వార్డెన్ రావాలి... ఆకలి తీర్చాలి'' అంటూ విద్యార్థుల ఆందోళనకు దిగారు. 104 ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు.

నవంబరు 16

మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను మెయిన్ కార్యకర్తలుగా గుర్తించాలని కోరుతూ ధర్నాకు దిగారు.

నవంబరు 18

కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్లు తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన ప్రదర్శన చేశారు. ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో పారిశుధ్య కార్మికులు, వాచ్‌మెన్‌లు సైతం ఆందోళన చేశారు.

కూటమి సంక్షోభ పాలన

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ హామీలపై విపరీతంగా ప్రచారం చేశారు. అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. కానీ ఇప్పటి వరకూ వాటిని పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయారు. వారిచ్చిన హామీ ప్రకారం జిల్లా ప్రజలకు అందాల్సిన లబ్ధి వివరాలు ఇవీ.



కూటమి సూపర్ సిక్స్ పథకాలు

1. తల్లికి వందనం కింద జిల్లాలో 1,68,000 మందికి సుమారు రూ.252 కోట్లు వరకు అందించాల్సి ఉంది.
2. నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించడం లేదా నిరుద్యోగ భృతి కోసం 4.80 లక్షల మందికి ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు వీరికి రూ.864 కోట్లు ఇవ్వాలి.
3. ఉచిత గ్యాస్ సిలిండర్ల అమలు నామ్‌కే వాస్తే అన్నట్టుగా మారింది. జిల్లాలో 3.90 లక్షల మందికి ఈ ఏడాది మూడు సిలిండర్లు రెండు ఎత్తి వేశారు. ఒకదానికి మాత్రమే చాలా తక్కువ మందికి అందించారు.
4. మహిళలకు నెలకు ఇస్తానన్న రూ.1,500 కోసం జిల్లాలో 6.03 లక్షల మంది ఎదురు చూస్తున్నారు. వీరికి ఏడాదికి రూ.1,094.52 కోట్లు ఇవ్వాల్సి ఉంది.
5. ఆర్టీసీ ఉచిత ప్రయాణం ఇప్పటికీ మొదలు కాలేదు. ఉచిత ప్రయాణం కోసం జిల్లాలో 9.10 లక్షల మంది ఎదురు తెన్నులు చూస్తున్నారు.
6. రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. 1.45 లక్షల మంది ఎదురు తెన్నులు చూస్తున్నారు.

దగాపడిన వారికి దన్నుగా వైఎస్సార్ సీపీ

డిసెంబరు 14

రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం రూ.20 వే లు అందించపోవడం, ఉచిత పంట బీమా ఎత్తివేయడానికి ఖండిస్తూ కలెక్టరేట్ వద్ద వైఎస్సార్ సీపీ నిరసన తెలిపింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు, రైతులు కలెక్టరేట్‌ను ముట్టడించారు.

డిసెంబరు 27

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోకవర్గాలలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, విద్యుత్ వినియోగదారులు నిరసన ప్రదర్శన, ర్యాలీలు, విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ధర్నా చేశారు.



రైతు సమస్యలను పరిష్కరించాలంటూ డిసెంబరు 14న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాలాజీ దర్శనానికి పోటెత్తిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లిలో కొలువైన బాల బాలాజీ స్వామి దర్శనానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారు జామున తొలి హారతి, మేలు కొలుపు సేవలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసంలో భాగంగా గోదావరి నుంచి జలాలు తీసుకు వచ్చి గోదాదేవితో పాటు బాల బాలాజీ స్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. స్వామి వారి సన్నిధిలో నిత్యం నిర్వహించే లక్ష్మీనారాయణ హోమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. గోశాలను సందర్శించి గోవులకు పూజలు చేశారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.2.12,910 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు **తెలిపారు. నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు** 65,750 విరాళాలుగా అందించారన్నారు. లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.39,780 ఆదాయం వచ్చిందన్నారు. 3,518 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 2,429 మంది **అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.**



అప్పనపల్లిలో భక్తుల రద్దీ

ఆక్వా జోన్‌లో చెరువుల విస్తీర్ణంపై సర్వే

అమలాపురం రూరల్: సముద్ర తీర ప్రాంతంలోని ఆక్వా జోన్, ఆక్వాయేతర జోన్లలో చెరువుల విస్తీర్ణంపై సర్వే చేసి, నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ మండలి, భూగర్భ జలశాఖ, మత్స్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్య, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులతో సర్వే బృందాలను ఏర్పాటు చేసి, ఆక్వా సాగు విస్తీర్ణంపై నివేదిక అందజేయాలన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న 46 వేల ఎకరాలకు, ఆక్వా జోన్‌లో లేని ఏడు వేల ఎకరాలకు గ్రామ, మండల, డివిజన్ వారీగా ఆక్వాజోనేషన్ టైప్‌ను నిర్ధారించాలన్నారు. నూతనంగా వెలువడిన జీవో ఎంఎస్ నంబర్ 7 ప్రకారం ఆక్వా చెరువుల అనుమతులను మంజూరు చేయాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి సూత్రాల ప్రకారం పెద్ద ఆక్వా చెరువులకు చుట్టూ సీపేజ్ డ్రెయిన్లు, గార్ల్యాండ్ డ్రెయిన్ల ద్వారా ఊట నీరు పారే సౌకర్యం ఉన్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. సబ్ డివిజనల్ స్థాయి కమిటీ పరిధిలో సంబంధిత డివిజనల్ రెవెన్యూ అధికారి.. ఐదు హెక్టార్ల లోపు చెరువులకు అనుమతులు మంజూరు చేయాలని, దానికి పైబడితే కోస్టల్ ఆక్వా అథారిటీ విభాగానికి పంపాలన్నారు. హరిత ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా సాగులో ఉన్న చెరువుల రద్దుకు సంబంధించి వైనతేయి నదిని ఆనుకొని ఉన్న గొల్లపాలెం, కరవాక, గోగన్నమఠంలో కొనసాగుతున్న రద్దు చర్యలు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జేసీ టి.నిశాంతి, ఇన్‌చార్జి డీఆర్ఓ కె.మాధవి, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ శంకర్రావు, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసు బాబు, భూగర్భ జలశాఖ సహాయ సంచాలకులు శివ ప్రసాద్, మత్స్య అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.



ఆక్వా జోన్ వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్


బాలలూ.. భళా

- కాకినాడలో రాష్ట్ర స్థాయి క్రియ పిల్లల పండగ ప్రారంభం
- ఆటపాటలతో చిన్నారుల సందడి
- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు
- ఆలోచింపజేసిన లఘు నాటికలు
- తొలి రోజు 15 అంశాలపై పోటీలు



తెలుగువీర లేవరా..: అల్లూరి సీతా రామరాజుగా ఆకట్టుకున్న చిన్నారి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నగరానికి చెందిన క్రియ స్వచ్ఛంద సంస్థ ఏటా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న క్రియ పిల్లల పండగకు జేఎన్‌టీయూకే వేదికైంది. తొలి రోజైన శనివారం నిర్వహించిన 11వ రాష్ట్ర స్థాయి అంతర్ పాఠశాలల సాంస్కృతిక పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 4,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తమలో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం రావడంతో.. అప్పుడే రెక్కలు విచ్చుకున్న పక్షుల మాదిరిగా.. వేలాదిగా చిన్నారులు వర్సిటీ అవరణలో సందడి చేశారు. శాస్త్రీయ నృత్యం, నాటికలు, ఏకపాత్రాభినయం, కోలాటం, గ్రూప్ సాంగ్స్, పోస్టర్ ప్రజెంటేషన్, సైన్స్ ప్రయోగాలు, డిబేట్ గ్రూపు, మ్యాప్, గణితం, క్విజ్, వ్యాస రచన, కథా రచన, కథా విశ్లేషణ, ఇంటర్‌నెట్‌లో విశ్లేషణ వంటి 15 అంశాల్లో చిన్నారులకు పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలుగా ఈ పోటీలు జరిగాయి. ఎక్కడ చూసినా రకరకాల వేషధారణలతో అలరించిన చిన్నారులతో వర్సిటీ మైదానం కళకళలాడింది. అల్లూరి సీతారామ రాజు, శ్రీకృష్ణదేవరాయలు, ఝాన్సీ లక్ష్మీబాయి తదితరుల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. పార్వతీ పరమేశ్వరులు, మహిషాసుర మర్దిని వంటి శాస్త్రీయ నృత్యాలతో పాటు చదువు, ఆరోగ్యం, ప్రాధాన్యాన్ని తెలిపేలా ప్రదర్శించిన లఘు నాటికలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అన్ని రంగాల్లో ముందుంటున్న మహిళలు నేటికీ వివక్షకు గురవుతున్న వైనాన్ని, మహిళల ప్రాధాన్యాన్ని వివరించేలా ప్రత్యేక నాటికను ప్రదర్శించారు. త్యాగరాజు, అన్నమయ్య తదితర వాగ్గేయకారుల కీర్తనలను విద్యార్థులు పోటీ పడి మరీ వీనుల విందుగా ఆలపించారు. వ్యవసాయ ప్రాధాన్యం, గ్రహణాలు ఏర్పడటం, భూ భ్రమణం, భూ పరిభ్రమణం తదితర భౌగోళిక అంశాలపై ప్రాజెక్టులు ప్రదర్శించారు. మరికొన్ని అంశాలపై ఆదివారం పోటీలు నిర్వహించనున్నారు.



జయజయహే మహిషాసుర మర్దిని: విద్యార్థినులు ప్రదర్శించిన మహిషాసుర మర్దిని నృత్యం



త్వరగా వెళ్దాం: పోటీలకు కుమార్తెను వాహనంపై తీసుకువస్తున్న తండ్రి

పోటీతత్వం అలవర్చుకోవాలి

సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని, బహుమతులతో సంబంధం లేకుండా నైపుణ్యం చూపి, దానిని మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు మొదటి మూడు బహుమతులతో పాటు రెండు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రియ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, వలంటీర్లు పాల్గొన్నారు.



నాటిక ప్రాక్టీస్ చేస్తున్న పిల్లలు



గోపాలబాలుడమ్మా..: శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణల్లో విద్యార్థులు



పురివిప్పిన మయూరాలై..



నమో వేంకటేశ..: వేంకటేశ్వరస్వామి వేషధారణలో..

క్లుప్తంగా

మానసిక రోగి వీరంగం



ఉంగరాల లక్ష్మణరావు

బిక్కవోలు: మండలంలోని పందలపాక సరిపల్లి పేటలో ఒక మానసిక రోగి వీరంగం వేయడంతో పలువురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఉంగరాల లక్ష్మణరావు అనే మానసిక రోగి శుక్రవారం రాత్రి తన భార్యను కొట్టడం ప్రారంభించాడు. దీంతో చుట్టుపక్కల వాళ్లు మందలించడంతో వారిని కొరకడం మొదలు పెట్టాడు. ఇలా సుమారు పది మందిని గాయపర్చాడు. దాదాపు రెండు గంటల పాటు అక్కడి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అనంతరం వారందరూ కలిసి లక్ష్మణరావుని కట్టి వేసి పోలీసులు అప్పగించారు. అతడిని పోలీసులు కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. బాధితుల్లో కొందరు అనపర్తి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.

రాజానగరంలో రేపు జాబ్ మేళా

రాజానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం జాబ్‌మేళా జరుగనుంది. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయా సంస్థల అధికారులు హరీష్‌చంద్ర ప్రసాద్, పెరుమాళరావు తెలిపారు. ఐటీఐ, డిప్లమా, బీటెక్, ఎంబీఏ, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన 19 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వారు అర్హులన్నారు. మూడు కంపెనీలకు చెందిన ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను ముందుగా httpr://naipunyam.ap.gov.in/urerrefirtration రిజిస్టర్ చేసుకోవాలన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకే జాబ్ మేళా జరిగే ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99888 53335, 87126 55686, 87901 18349, 8790117279 నంబర్లను సంప్రదించవచ్చు.

నేడు ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కన్వీనర్ ఏవీడీ ప్రసాదరావు శనివారం ఈ విషయాన్ని తెలిపారు. ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి పద్మజా బాల ఆధ్వర్యంలో అండర్ -20 విభాగంలో ఎంపిక జరుగుతాయని, 12-1-2005 తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు.

పండ్ల పంటలపై విస్తృత పరిశోధనలు

- రాష్ట్రవ్యాప్తంగా 9 పరిశోధన స్థానాల్లో అధ్యయనం
- నాణ్యమైన, అధిక దిగుబడి ఇచ్చే వంగడాల అభివృద్ధికి కృషి
- అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధన పథకం ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రకాష్ పాటిల్



డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న అరటి పంటను పరిశీలిస్తున్న డాక్టర్ పాటిల్ తదితరులు

పాడి-పంట

కొవ్వూరు: పండ్ల పంటలపై రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది పరిశోధన స్థానాల్లో పరిశోధనలు చేస్తున్నామని అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధన పథకం (ఏఐసీఆర్‌పీ – బెంగళూర్) ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రకాష్ పాటిల్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులోని వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానాన్ని ఆయన శనివారం సందర్శించారు. అరటి, మామిడి, జామ, పనస పంటలపై ఐదేళ్లుగా చేస్తున్న పరిశోధన ఫలితాలపై ఆయన శాస్త్రవేత్తలతో సమీక్షించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. పండ్ల పంటలపై పరిశోధనలకు రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం, అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధన పథకం ద్వారా కేంద్రం 75 శాతం అందిస్తున్నాయన్నారు. తిరుపతిలో నిమ్మ, బత్తాయి; వైఎస్సార్ కడప జిల్లా అనంతరాజుపేటలో బొప్పాయి, జామ, మామిడి, బత్తాయి; కొవ్వూరులో అరటి; వెంకటరామన్నగూడెంలో సపోటా, పనస తదితర పండ్లపై పరిశోధనలు చేస్తున్నామని వివరించారు. పంటలకు పురుగు మందుల వాడకం తగ్గించి, ఉత్పత్తిలో నాణ్యత పెంచి, అంతర్జాతీయ మార్కెట్‌కు అనువైన అధిక దిగుబడులు అందించే రకాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులకు అనువుగా ఉండే వంగడాలతో పాటు కొత్త వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై నిరంతర అధ్యయనం చేస్తున్నామని తెలిపారు.

నూతన అరటి వంగడాల అభివృద్ధి

వెంకటరామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన యునివర్సిటీ డైరెక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో అరటి సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. మారేడుమిల్లిలో అరటి సాగులో టిష్యూ కల్చర్‌పై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. కొవ్వూరులోని వైఎస్సార్ ఉద్యాన అరటి పరిశోధన స్థానంలో తమిళనాడు తిరుచ్చి నుంచి తెచ్చిన కావేరి కల్కి పండ్ల అరటి రకాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ రకం కాయ తియ్యగా, పొట్టిగా ఉండి, ఎక్కువ రోజులు నిల్వ ఉంటుందన్నారు. గాలివానలకు తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. తొక్క నల్లగా అయినప్పటికీ లోపలి పండు మాత్రం పాడవదన్నారు. కేరళ నుంచి తెచ్చిన పపోలో రకం కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కొంచెం తియ్యగా ఉండే ఈ రకం చిప్స్ తయారీకి అనువుగా ఉంటుందన్నారు. కాయంతా ఒకే లావు ఉండటం వలన చిప్స్ ఒకేవిధంగా వస్తాయన్నారు. గతంలో చిప్స్‌కి వాడే నేంద్ర అనే రకం కాయ చివరిలో సన్నగా ఉండడంతో కొంత వృథా అయ్యేదన్నారు. మహారాష్ట్ర నుంచి పులే ప్రైడ్ అనే పొట్టి రకం పండుపై కూడా అధ్యయనం చేస్తున్నామన్నారు. టెర్రస్ గార్డెన్‌లో పెంచుకోవడానికి ఇది అనువుగా ఉంటుందన్నారు. తెల్ల చక్కెరకేళీ, పచ్చ అరటి పండ్ల రకాలతో పాటు కొవ్వూరు బొంత అనే కూర రకాలను ఎక్కువ దిగుబడి అందించేలా పరిశోధనలు చేస్తున్నామని మాధవి చెప్పారు. కార్యక్రమంలో కొవ్వూరు వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త పి.లలితా కామేశ్వరి, శాస్త్రవేత్తలు వి.శివకుమార్, ఎ.స్నేహలత, కె.రవీంద్రకుమార్ కూడా పాల్గొన్నారు.

కొత్త పండ్ల అభివృద్ధిపై కసరత్తు

ఇటీవల రాష్ట్రంలో డ్రాగన్ ఫ్రూట్, బటర్ ఫ్రూట్ (అవకాడో), రామ్ బూటన్ వంటి పండ్ల సాగుపై శాస్త్రవేత్తలతో అధ్యయనం చేస్తున్నామని డాక్టర్ పాటిల్ తెలిపారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామంలో ప్రయోగాత్మకంగా మూడెకరాల్లో అవకాడో సాగు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారని, దీనిపై మూడేళ్లుగా పలు అధ్యయనాలు చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా చీడపీడలు, పండు నాణ్యత, సైజు వ్యత్యాసం వంటి వాటిపై పరిశోధనలు కొనసాగుతున్నాయన్నారు. ఇక్కడి వాతావరణానికి అనువుగా ఉండే వంగడాల తయారీపై దృష్టి సారించామన్నారు. అన్ని రకాల పండ్లలో మంచి వంగడాల తయారీ, శాస్త్ర, సాంకేతిక, యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్, నిల్వ పద్ధతులపై నిరంతర ప్రయోగాలు కొనసాగుతున్నాయన్నారు. వీటి ద్వారా వచ్చిన మెరుగైన ఫలితాలను బట్టి ఆయా వంగడాల సాగుకు రైతులకు సిఫారసు చేస్తామన్నారు. రెండేళ్లకోసారి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉద్యాన పంచాంగం తయారు చేసి రైతులకు అందిస్తున్నామని చెప్పారు.

నేడు రాష్ట్రస్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు



పోటీలో పాల్గొనేందుకు ఎద్దును సిద్ధం చేస్తున్న రైతులు

రంగంపేట: వడిశలేరు – రంగంపేట గ్రామాల మధ్య ఏడీబీ రోడ్డు పక్కనే గల పామాయిల్ తోటలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా పోటీ ఆర్గనైజర్లు బొప్పన బ్రహ్మాజీరావు, కూటి కోటేశ్వరరావు శనివారం మాట్లాడుతూ దివంగత ఆదర్శ రైతు గన్ని సత్యనారాయణమూర్తి స్మారక 6వ వార్షిక ఎడ్లబళ్ల పరుగు పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సీనియర్, జూనియర్ విభాగాలలో 1600, 1000 మీటర్ల పోటీలలో సుమారు వంద జోడీల ఎద్దులు పాల్గొంటున్నాయన్నారు. వీటిలో విజేతలకు బుల్లెట్, ఎలక్ట్రిక్ బైక్‌లను బహుమతులుగా అందిస్తామన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పోటీలకు భారీగా పోటీదారులు హాజరవుతారని, ఇప్పటికే పలువురు పోటీ ప్రదేశానికి చేరుకున్నారని వివరించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

డీఎస్ పాలెం ఇసుక ర్యాంపుపై దాడి



డీఎస్ పాలెం ఇసుక ర్యాంపులో ట్రాక్టర్‌ను సీజ్ చేసిన అధికారులు

పి.గన్నవరం: స్థానిక డీఎస్ పాలెం వద్ద వైనతేయ నదిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపుపై శనివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాంపులో ఒకటి, ఏజీ రోడ్డులో రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. కాగా.. పి.గన్నవరం శివారు డీఎస్ పాలెంలో అక్రమంగా ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్నారని ఇటీవల సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు కలెక్టర్‌కు జనసేనకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు ఫిర్యాదు చేశారు. దీంతో మైన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సుజాత, హెడ్‌వర్క్స్ ఏఈ నాయుడు, ఏఎస్సై బి.పట్టాభి రామయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెన్నపు దాంగే తదితరులు దాడులు నిర్వహించారు. తొలుత ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. అనంతరం డీఎస్ పాలెం ర్యాంపులో ఉన్న మరొక ట్రాక్టర్‌ను సీజ్ చేసి, తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అయితే ఇసుక కోసం వచ్చిన కొన్ని ఖాళీ ట్రాక్టర్లను కూడా తహసీల్దార్ కార్యాలయానికి తరలించాలని అధికారులు చెప్పడంతో డ్రైవర్లు కొద్దిసేపు ఆందోళన చేశారు. ఇది అనధికార ర్యాంపు అని తమకు తెలియదని, తమ ట్రాక్టర్లలో ఇసుక లోడు చేయని కారణంగా తమను వదిలేయాలని కోరారు. దీంతో వారిని అధికారులు విడిచి పెట్టారు. ఈ ర్యాంపునకు ప్రభుత్వ అనుమతి లేదని మైన్స్ ఆర్ఐ సుజాత తెలిపారు. దాడుల్లో మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ రెహమాన్, వీఆర్వో కోరుకొండ శ్రీను పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి వసూలు దందా!

అల్లవరం: హౌసింగ్ రుణాల పేరుతో ప్రజల నుంచి ఓ టీడీపీ నాయకుడు డబ్బు వసూలు చేసిన విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. కూటమి అధికారంలోకి రావడంతో ఇంటి రుణాలు ఇప్పిస్తామంటూ ఆ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం చేసిన వారు, కొత్తగా నిర్మించుకునే వారికి ఆశ పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంట్రుకోన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గెద్దాడ శ్రీను హౌసింగ్ రుణాలు ఇప్పిస్తామని లబ్ధిదారుల నుంచి రూ. 10 వేలు చొప్పున వసూలుకు పాల్పడుతున్నాడు. ఈ విషయం అదే గ్రామానికి చెందిన ఓ మహిళ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తనకు హౌసింగ్ లోన్ ఇప్పిస్తానని గెద్దాడ శ్రీను డబ్బులు తీసుకున్నాడని, తెలియక డబ్బులు ఇచ్చానని వాపోయింది. గ్రామంలో జనసేన పార్టీకి చెందిన ఓ నాయకుడి సారథ్యంలో టీడీపీ అక్రమాలు సోషల్ మీడియా వేదికగా వెలుగులోకి వచ్చాయి.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

కొవ్వూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఫీల్డ్ అసిస్టెంట్ గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించాడు.రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ ప్రాంతానికి చెందిన గురజాల చంద్రశేఖర్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం గామన్ ఇండియా బ్రిడ్జి 67వ పిల్లర్ నుంచి గోదావరిలో దూకేశాడు. ఆ ప్రదేశంలో నీరు తక్కువగా ఉండడంతో ఇసుక దిబ్బ మీద ఉండిపోయాడు. అటుగా వెళుతున్న ప్రయాణికులు 112కి కాల్ చేసి ఈ సమాచారం ఇచ్చారు. దీంతో పట్టణ పోలీసులు, ఫైర్ సిబ్బంది బోట్ ద్వారా ఘటనా స్థలానికి చేరుకుని అతడిని బయటకు తీసుకువచ్చారు. భార్యతో ఏర్పడిన వివాదం కారణంగానే ఆత్మహత్యకు యత్నించినట్టు చంద్రశేఖర్ చెప్పాడు.

తాచుపామును రక్షించిన స్నేక్ క్యాచర్

కాట్రేనికోన: చెరువు చుట్టూ వేసిన ఫెన్సింగ్ వలలో చిక్కుకున్న తాచు పామును స్నేక్ క్యాచర్ వర్మ విడిపించారు. వివరాల్లోకి వెళితే.. చెయ్యేరులోని మంతెన సుబ్బరాజు రొయ్యల చెరువు చుట్టూ వేసిన ఫిన్సింగ్ వలలో సుమారు ఐదు రోజుల క్రితం తాచుపాము చిక్కుకుంది. గమనించిన చెరువు కాపలా మనిషి ఈ విషయాన్ని యజమాని సుబ్బరాజు చెప్పాడు. ఆయన సమాచారం మేరు స్నేక్ క్యాచర్ వర్మ శనివారం అక్కడకు చేరుకుని పామును వల నుంచి విడిపించారు. ఐదు రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో నీరసించిపోయిన పాముకు నీటిని పట్టించారు. అనంతరం పాస్టిక్ బాటిల్‌లో బంధించారు. పామును అటవీ ప్రాంతంలో వదిలి వేస్తానని వర్మ చెప్పారు.



తాచుపాముకు నీరు తాగిస్తున్న స్నేక్ క్యాచర్ వర్మ

● మార్కెట్‌లో మహారాష్ట్ర జామ



రాజమహేంద్రవరంలో మహారాష్ట్ర జామకాయలు విక్రయిస్తున్న సత్యనారాయణ



ప్రత్యేక ప్యాకింగ్‌తో వచ్చిన కాయలు

ఆంధ్రా ఆపిల్‌గా పిలిచే జామకాయ దిగుబడి ప్రస్తుతం జిల్లాలో తగ్గిపోయింది. దీంతో వ్యాపారులు మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇవి చిన్న సైజు నుంచి 350 గ్రాముల బరువు వరకూ ఉంటున్నాయి. కిలో కాయలను రూ.120 నుంచి రూ.100 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. జిల్లాలో దేశీవాళి జామ కాయ దిగుబడి అందుబాటులో లేకపోవడంతోనే మహారాష్ట్ర నుంచి వీటిని దిగుమతి చేసుకుంటున్నట్టు కొత్త తుంగపాడుకు చెందిన వ్యాపారి ఉల్లింగి సత్యనారాయణ తెలిపారు. వీటిని అట్టపెట్టెల్లో ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి పంపిస్తారన్నాడు. ఈ కాయలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారని, విక్రయాలు కూడా బాగున్నాయని తెలిపాడు.

– అల్కాట్‌తోట(రాజమహేంద్రవరం రూరల్):

తాళ్లరేవు ఆస్పత్రి నిర్వహణపై జేసీ ఆగ్రహం



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జేసీ రాహుల్ మీనా

తాళ్లరేవు: ఆస్పత్రిలో పనిచేస్తున్న నలుగురు వైద్యులకు ముగ్గురు సెలవులో ఉండడంపై జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆగ్రహం వ్యక్తం చేశారు. వివర్లాల్లోకి వెళితే.. తాళ్లరేవులో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సుకు జేసీ రాహుల్ మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా తాళ్లరేవు సామాజిక ఆస్పత్రి సమస్యలపై స్థానిక నాయకులు దడాల బుజ్జిబాబు, జక్కల ప్రసాద్ తదితరులు ఫిర్యాదు చేశారు. జేసీ వెంటనే ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. సూపరింటెండెంట్ విధుల్లో లేకపోవడం మరో ఇద్దరు వైద్యులు పలు కారణాలతో హాజరుకాకపోవడంపై డ్యూటీ డాక్టర్ సిరిల్‌ను ప్రశ్నించారు. ముగ్గురూ సెలవులో ఉన్నారని ఆయన చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రి ల్యాబ్‌లో రూ.80 వేల విలువైన ఎలక్ట్రోలైట్ ఎనలైజర్ యంత్రం మాయమైన ఘటనపై ల్యాబ్ టెక్నీషియన్‌ను వివరాలు అడిగారు. ఆస్పత్రిలోని ప్రతి విభాగాన్ని, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు మార్చుకోవాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు.

పంట కాలువలో వ్యక్తి మృతదేహం

ఐ పోలవరం: మండలపరిధి ఐ.పోలవరం నుంచి టి.కొత్తపల్లి వెళ్లే రహదారిలోని పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు శనివారం గుర్తించారు. మృతుడి సుమారు 40 నుంచి 50 ఏళ్ల లోపు ఉంటుందన్నారు. అతడికి సంబంధించి ఎటువంటి వివరాలు దొరకలేదన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	11,000 – 11,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

మైక్రో ఇంజినీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



దుర్గేష్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్

రాజమహేంద్రవరం రూరల్: పొరుగు సేవల విధానంలో మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్ పోస్టు భర్తీ కోసం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి ఏ.దుర్గేష్ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకం (ఏపీఎంఐపీ) కార్యాలయంలో విధులు నిర్వహించాలన్నారు. బీటెక్ (అగ్రికల్చర్ ఇంజినీరింగ్) విద్యార్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామన్నారు. ఆసక్తి కలవారు కార్యాలయ ఇ-మెయిల్ apmiprecruitment @fmai.comకు 2025 జనవరి 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను పంపాలన్నారు. బొమ్మూరులోని తహసీల్దార్ కార్యాలయం పక్కన గల వైటీసీ భవనంలోని ఏపీఎంఐపీ కార్యాలయంలో 2025 జనవరి 22వ తేదీన జరిగే మౌఖిక పరీక్షకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 79950 87141 నంబర్‌ను సంప్రదించవచ్చు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

అయినవిల్లి: అదృశ్యమైన వ్యక్తి మృతదేహం పంట కాలువలో లభించింది. ఎస్సై మనోహర్‌జోషి తెలిపిన వివరాల ప్రకారం.. శానపల్లిలంకకు చెందిన యల్లమిల్లి శ్రీనివాస్‌కుమార్ (52) తొత్తరమూడి గ్రామంలోని కొండవటివారిలంకలో గల కూరగాయల దుకాణంలో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం తెల్లవారుజామున నిద్రలేచి కూరగాయల షాపునకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికీ రాకపోవడంతో కూరగాయల దుకాణం యజమానిని కుటుంబ సభ్యులు ఆరా తీశారు. అయితే కుమార్ అసలు దుకాణానికి రాలేదని ఆయన బదులు చెప్పాడు. దీంతో కుమార్ ఆచూకీ కోసం వెతకగా కొండవటివారిలంకలోని కాలువ వద్ద అతడి సైకిల్, చెప్పులు కనిపించాయి. ఈ నేపథ్యంలో శనివారం శానపల్లిలంకలోని పంటకాలువలో అతడి మృతదేహం లభ్యమైంది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి కాలువలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెంది ఉండవచ్చునని స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.